# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దివ్యాంగుల సామాజిక, సాంస్కృతిక, విద్యా, ఆర్థిక సాధికారతకు ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర సామాజిక న్యాయం సాధికార శాఖ మంత్రి బన్వారీ లాల్ వర్మ పేర్కొన్నారు.**
2. **ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని పట్టణాలను పోస్టర్ రహితంగా మారుస్తామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు.**
3. **వివిధ జిల్లాల పారిశ్రామిక పార్కుల్లో 203 సంస్థలకు ఏపీఐఐసీ భూములను కేటాయించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు.**
4. **రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడలో నూలు డిపో ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిన్న ఉత్తర్వులు జారీ చేసింది.**
5. **ఈ నెల 8న విశాఖపట్నంలో మలబార్ మారిటైం విన్యాసాలు ప్రారంభమవుతాయని నేవీ అధికారులు తెలిపారు.**

**==========================**

దివ్యాంగుల సామాజిక, సాంస్కృతిక, విద్యా, ఆర్థిక సాధికారతకు ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర సామాజిక న్యాయం సాధికార శాఖ మంత్రి బన్వారీ లాల్ వర్మ పేర్కొన్నారు. సామాజిక్ అధికారిత శివిర్ కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లాలో నిన్న జరిగిన దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో కేంద్ర మంత్రి విశిష్ట అతిథిగా వర్చువల్ గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్ నినాదంతో ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దివ్యాంగుల సర్వతో ముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుగమ్య భారత్ అభియాన్ కింద 38 భవనాల నిర్మాణానికి 14.36 కోట్ల రూపాయలు విడుదల చేశామని కేంద్ర మంత్రి తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని పట్టణాలను పోస్టర్ రహితంగా మారుస్తామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద పోస్టర్లను మంత్రి స్వయంగా తొలగించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ వారంలోగా నెల్లూరు నగరంలో పోస్టర్లు ఫ్లెక్సీలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. రాజకీయ పార్టీల సమావేశాల సమయంలో ఏర్పాటు చేసే ఫ్లెక్సీలను 48 గంటల్లోగా తొలగించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి రాజకీయ పార్టీ నేతలతో పాటు ప్రజలందరూ సహకరించాలని నారాయణ కోరారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ జిల్లాల పారిశ్రామిక పార్కుల్లో 203 సంస్థలకు ఏపీఐఐసీ భూములను కేటాయించినట్లు జరిగిందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. భూముల కేటాయింపులు జరిగిన పరిశ్రమల ద్వారా 2వేల,349.86 కోట్ల రూపాయలు పెట్టుబడులు, 4వేల,300 మంది యువతకు ఉద్యోగాలు రానున్నాయని ఆమె స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన మంతెన రాంబాబు రాజును హోంమంత్రి అనిత అభినందించారు.

---------------------------

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడలో మరమగ్గాల కార్మికుల కోసం రూ.50 కోట్లతో నూలు డిపో ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర చేనేత సహకార సంఘం, టెస్కో దీనికి నోడల్ ఏజెన్సీగా వ్యవహరించాలని ఆదేశించింది. మరమగ్గాల కార్మికుల దీర్ఘకాల కల నెరవేరిందని, నూలు డిపో ఏర్పాటు వల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 వేల మంది నేతన్నలకు లబ్ధి చేకూరుతుందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

---------------------------

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజైన ఈ రోజు విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. మణిద్వీప క్షేత్రంలో కొలువై ఉన్న అమ్మవారి శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారం ఆమె అత్యున్నత శక్తి, సౌందర్యాన్ని సూచిస్తుందని ఆలయ అర్చకులు తెలిపారు. కాగా దసరా మహోత్సవాలలో భాగంగా శ్రీశైల రాత్రి భ్రమరాంబికాదేవి అమ్మవారు చంద్రఘంట అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మరోవైపు తెలంగాణలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ రోజు అట్ల బతుకమ్మను నిర్వహిస్తున్నారు.

---------------------------

హైదరాబాద్ విపత్తు స్పందన, ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ ఏజెన్సీ, హైడ్రా కు విస్తృతాధికారాలు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. ఈ మేరకు నిన్న రాజ్‌భవన్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఇకపై హైడ్రా చేపట్టబోయే కార్యకలాపాలకు చట్టబద్ధత లభించిందని అధికారులు తెలిపారు.

---------------------------

దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో నిన్న జరిగిన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో మంత్రి మాట్లాడుతూ డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడిగా, ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా పనిచేసి ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 125 మంది ఉత్తమ ఉపాధ్యాయ దంపతులను మంత్రి సత్కరించారు.

---------------------------

తూర్పు నౌకాదళం ముఖ్య కేంద్రమైన విశాఖపట్నం లో ఈ నెల 8న మలబార్ మారిటైం విన్యాసాలు ప్రారంభమవుతాయని నేవీ అధికారులు తెలిపారు. సీ-ఫేజ్, హార్బర్‌ఫేజ్‌లలో జరిగే విన్యాసాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. భారత్‌తో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ దేశాలు భాగస్వామ్యమవుతున్న ఈ విన్యాసాలు 18వ తేదీ వరకు కొనసాగుతాయని, హిందూ మహాసముద్రం, ఇండో-పసిఫిక్ సముద్ర ప్రాంతాల్లో మారిటైం సవాళ్లను దీటుగా ఎదుర్కొనేందుకు బహుళపక్ష మారిటైం విన్యాసాలు దోహదపడతాయని అధికారులు వెల్లడించారు.

---------------------------

రైతుల సమస్యల పరిష్కారానికి ఆర్వోఆర్ చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆర్వోఆర్ చట్టాన్ని అమలుచేసేందుకు పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన నల్గొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండలం నెల్లికల్ గ్రామ రైతులతో నిన్న నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సలహాలు, సూచనలు మేరకు చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. అటవీ, రెవెన్యూ స్థలాలను సాగు చేసుకుంటున్న రైతులకు  సర్వే పూర్తి చేసి శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి తెలిపారు.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు శనివారం రాత్రి శ్రీ మలయప్పస్వామివారు  వీణ ధరించి సరస్వతి దేవి అలంకారంలో హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని వాహనసేవలో దర్శించుకున్నారు. కాగా ఈరోజు ఉదయం స్వామి వారు సింహ వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

---------------------------

మూసీ పరీవాహక పరిధిలోని కుటుంబాల నివాసం, జీవనోపాధి, ఇళ్ల కేటాయింపుపై 'లైవ్లీహుడ్ సపోర్ట్ కమిటీ'ని ఏర్పాటు చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు సభ్యులుగా గల కమిటీకి  సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ ముఖ్య కార్యనిర్వహణాధికారి, ఛైర్‌పర్సన్‌గా జీహెచ్ఎంసీ కమిషనర్ వైస్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో తెలిపారు.

---------------------------

గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 317పై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపసంఘం త్వరలో ప్రభుత్వానికి నివేదిక అందచేయనుందని ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాం సందర్భంగా నిన్న చేవెళ్లలో 'తెలంగాణ ప్రజా పాలనలో ఉపాధ్యాయుల పాత్ర' అనే అంశంపై జరిగిన విద్యా సదస్సు కు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూతన విద్యావిధానం రూపొందించడానికి ప్రభుత్వ నియమించిన మంత్రివర్గ ఉపసంఘానికి మేధావులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తమ సూచనలను అందజేయాలని కోరారు. ఉపాధ్యాయులకు పీఆర్సీ అమలు, డీఏ పెంపు, ఇళ్ల స్థలాలు కేటాయింపు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు.

---------------------------

ఈరోజు ప్రపంచ మస్తిష్క పాక్షిక పక్షవాత నివారణ దినాన్ని నిర్వహిస్తున్నారు. పసిపిల్లల్లో, చిన్నారుల్లో ఎక్కువగా కనిపించే ఈ వ్యాధి పట్ల అవగాహన కల్పించేందుకు 2012 నుండి ప్రపంచవ్యాప్తంగా దీనిని మస్తిష్క పక్షవాతం పిల్లల్లో ఎదుగుదలను నిరోధిస్తుంది. గాయం లేదా వైకల్యం వలన సంభవించే ఈ నరాల సమస్య వలన కదలికలకు సంబంధించి కండరాల సమన్వయం దెబ్బతింటుంది. భారతదేశంలో ప్రతి వెయ్యి మందిలో ముగ్గురికి మస్తిష్క పక్షవాతం సంభవించే అవకాశం ఉన్నట్లు అంచనా వెశారు.

=====================